సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం, 26, జూన్, 2023



ఎండిపోతున్నా పట్టింపేది..?

వేములవాడ: హరితహారం నిర్వహించే అటవీశాఖ అధికారులు తమ కార్యాలయం ముందున్న చెట్లు ఎండిపోతున్నా రక్షణ చర్యలు తీసుకోవడం లేదంటూ జనం వాపోతున్నారు.



పంచాయితీలు.. సెటిల్‌మెంట్లు

రుద్రంగి మండలంలోని పలు పల్లెల్లో పెద్దమనుషులుగా చలామణి అయ్యే వ్యక్తులు అమాయకుల అవసరాన్ని ఆసరాగా మల్చుకుంటున్నారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కూలి పెంచకుంటే జూలై 1 నుంచి సమ్మె



సమావేశంలో నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని సారంపల్లి– బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులో బతుకమ్మ చీరల బ్లౌజ్ పీస్ వస్త్రం తయారు చేస్తున్న కార్మికులకు కూలి పెంచాలని, లేకుంటే జూలై 1 నుంచి సమ్మెలోకి వెళ్తామని సీఐటీయూ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ హెచ్చరించారు. ఆదివారం టెక్స్‌టైల్ పార్కులోని కార్మికుల క్యాంటీన్ వద్ద మాట్లాడారు. బతుకమ్మ చీరల బ్లౌజ్ పీస్ వస్త్రానికి ఈ ఏడాది పిక్కులను పెంచిన సందర్భంగా కార్మికుల కూలి కూడా పెంచాలని కోరారు. ప్రైవేటు వస్త్రానికి బతుకమ్మ చీరలకు తేడా లేకుండా పోయిందని కార్మికులకు అదే కూలి వస్తోందని వాపోయారు. వారం క్రితం యజమానుల సంఘానికి వినతిపత్రం ఇచ్చామని, కానీ ఎలాంటి స్పందన లేదని ఆరోపించారు. మీటరు వస్త్రానికి రూ.4.50 పైసలు కూలి పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టెక్స్‌టైల్ పార్కు వర్కర్స్ యూనియన్ నాయకులు అక్కల శ్రీనివాస్, జెల్ల సదానందం, ఆడెపు శుభోఖర్, మహేశ్, రాజమల్లు, కనకయ్య, రంగయ్య, అంబదాస్, శ్రీకాంత్, వేణు, మహేశ్, రవి, నాగరాజు, సంతోష్, శ్రీనివాస్, అశోక్, రమేశ్, కిషన్, నరేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సీనియర్ ఉషు పోటీలకు ఎంపిక

గంభీరావుపేట(సిరిసిల్ల): మహారాష్ట్రలోని పూణెలో ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న జాతీయస్థాయి సీనియర్ ఉషు పోటీలకు జిల్లా నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికై నట్లు అకాడమీ కోచ్ భార విక్రమ్‌గాంధీ తెలిపారు. గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన సాయికృప, సిరిసిల్లకు చెందిన శ్రీనివాస్, శ్రీధర్, శ్రీనివాస్ ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి



బీమా పత్రాలు అందజేస్తున్న అంజిరెడ్డి

గంభీరావుపేట(సిరిసిల్ల): ఐక్యతతో హక్కులు సాధించుకోవాలని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కూర అంజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘ సభ్యులకు ఆదివారం బీమా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్డి సంఘం సభ్యులందరికీ బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో రెడ్డి భవన నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గడ్డమీది శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కమలాకర్ రెడ్డి, జిల్లా నాయకులు పాతూరి మహేందర్ రెడ్డి, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ముత్యాల రాజిరెడ్డి, రాజనర్సింహా రెడ్డి, సందుపట్ల రాజిరెడ్డి, అర్జున్ రెడ్డి, లక్కిరెడ్డి లత, రమణ, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



పార్టీలో చేరిన వారితో సత్యనారాయణ

ఇల్లంతకుంట (మానకొండూర్): పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వైశ్యభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో అవినీతి పెరిగిందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు పథకాలు మూలనపడ్డాయని, ఇప్పుడు బీసీ బంధు పేరుతో మరో కొత్త నాటకానికి తెరలేపారన్నారు. రైతు రుణమాఫీ చేస్తామని నాలుగున్నరేళ్లు గడుస్తున్నా చేయలేదన్నారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, పసుల వెంకటి, ఎస్‌ఎల్ గౌడ్, బాలపోచయ్య, ఒగ్గు రమేశ్, జమాల్, లింగం, మల్లయ్య, ప్రసాద్, రాజేశం, మల్లారెడ్డి, నరేశ్, తదితరులున్నారు.

సబ్సిడీగ్యాస్.. సైడ్‌ట్రాక్



సిరిసిల్లలో సబ్సిడీ సిలిండర్ల సరఫరా

జిల్లాలో సిలిండర్ల స్వరూపం

గ్యాస్ ఏజెన్సీలు	12
సింగిల్ సిలిండర్ కనెక్షన్‌లు	55,860
డబుల్ సిలిండర్ కనెక్షన్‌లు	34,474
దీపం సిలిండర్ కనెక్షన్‌లు	25,033
సీఎస్‌ఆర్ కనెక్షన్‌లు	14,452
పీఎంయూవై కనెక్షన్‌లు	19,426
మొత్తం కనెక్షన్లు	1,49,245
జిల్లాలో సగటున సిలిండర్ల రీఫిల్లింగ్	46,896

- వాహనాలకు వంటగ్యాస్
- మోటార్ పెట్టు.. గ్యాస్ కొట్టు
- జిల్లాలో యథేచ్ఛగా అక్రమ దందా

సిరిసిల్ల: పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు వాహనదారులకు కొత్త ఆలోచనను తెచ్చిపెట్టాయి. గ్యాస్‌ను అక్రమంగా వాహనాలకు వినియోగిస్తున్నారు. ఒక్క సిలిండర్ బుడ్డీని నింపుకుంటే ఏకంగా 400 కిలోమీటర్లు ప్రయాణించే అవకాశం ఉండడంతో అక్రమ పద్ధతిలో సబ్సిడీ గ్యాస్‌ను వాడుతున్నారు. మార్కెట్‌లో సిలిండర్ ధర రూ.1,174 ఉండడంతో ఒక్క బుడ్డీగ్యాస్‌ను ఎక్కిస్తే కిలోమీటరుకు కేవలం రూ.3 ఖర్చు అవుతుంది. అదే పెట్రోల్, డీజిల్ అయితే కిలోమీటరు ప్రయాణానికి రూ.5 నుంచి రూ.8 వరకు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో తక్కువ ధరకు ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశం ఉండడంతో వాహనదారులు సబ్సిడీ సిలిండర్లకు ఎసరు పెడుతున్నారు. సిలిండర్ నుంచి గ్యాస్‌ను వాహనంలోకి నింపేందుకు ప్రత్యేకమైన నాజిల్ ఉండే ఎలక్ట్రికల్ మోటార్ ఉంటుంది. ఆ మోటార్ సాయంతో గ్యాస్‌ను ఎక్కిస్తారు. సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్ రీఫిల్లింగ్(14 కిలోలు) ధర రూ.1,173 ఉండగా.. కమర్షియల్ సిలిండర్ రీఫిల్లింగ్(19 కిలోలు) ధర రూ.2,026 ఉంది. వాణిజ్య సిలిండర్ల ధర ఎక్కువగా ఉండడంతో ఇంట్లో వంట కోసం ప్రభుత్వం సబ్సిడీపై అందించే సిలిండర్లను వాహనాలకు వాడుతున్నారు.

అన్ని ప్రాంతాల్లోనూ అడ్డాలు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, బోయినపల్లి, చందుర్తి, రుద్రంగి, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో గ్యాస్ ఫిల్లింగ్ కోసం ప్రత్యేకమైన అడ్డాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో గుట్టుగా వాహనాల్లో గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్నారు. అప్పుడప్పుడు పౌరసరఫరాల అధికారులు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి సిలిండర్లను, ఎలక్ట్రికల్ మోటార్లను, విద్యుత్ వైర్లను స్వాధీనం చేసుకుంటున్నారు. కానీ ఇటీవల ఇతర పనుల్లో బిజీగా ఉండే ఆయా శాఖల అధికారులు సబ్సిడీ గ్యాస్ ఫిల్లింగ్‌పై పెద్దగా పట్టింపు లేకపోవడంతో అక్రమ దందా సాగుతోంది.



"వ్యాన్ వద్ద వంటగ్యాస్ సిలిండర్ బుడ్డీని బోర్లించి పెట్టి.. ఎలక్ట్రికల్ మోటారు సాయంతో సిలిండర్‌లోని గ్యాస్‌ను వ్యాన్‌లోకి ఎక్కిస్తున్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడంతో ప్రత్యామ్నాయంగా వంటగ్యాస్‌ను ఇలా అక్రమంగా నింపి వాహనాలు నడిపిస్తున్నారు. ప్రభుత్వం ఇంటికి సరఫరా చేసే సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్లు ఇలా వాహనాలకు ఇంధనంగా మారుతున్నాయి. ఇది తప్పని తెలిసినా వినియోగిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఈ అక్రమదందా సాగుతోంది."

కట్టడి చేస్తాం



జిల్లాలో సబ్సిడీ వంట గ్యాస్ పక్కదారి పట్టకుండా తనిఖీలు చేపడతాం. ఎవరైనా అక్రమంగా వాహనాలకు సబ్సిడీ గ్యాస్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలోనూ అనేక సార్లు దాడులు చేసి పట్టుకున్నాం. చిరు వ్యాపారులు కొందరు సబ్సిడీ గ్యాస్ వాడుతుంటారు. కానీ వాహనాలకు వినియోగించడం నేరం. తప్పకుండా చర్యలు తీసుకుంటాం. – ఎస్.జితేందర్‌రెడ్డి, డీఎస్‌వో

అక్రమంగా మట్టి తరలింపు.. అడ్డుకున్న బీజేపీ నాయకులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులో మట్టి దందా జోరుగా సాగుతుంది. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో జేసీబీలు, టిప్పర్లతో తవ్వకాలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవుదినం కావడంతో మట్టి మాఫీయాకు అడ్డు అదుపులేకుండా పోయింది. పెద్దూరులోని మైసమ్మ గుట్ట వద్ద అక్రమంగా మట్టిని తరలిస్తుండగా బీజేపీ నాయకులు అడ్డుకుని సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అధికారుల నిర్లక్ష్య ధోరణితోనే మట్టి అక్రమ వ్యాపారం జోరుగా సాగుతుందన్నారు. మట్టి తరలిస్తున్నారని, మైనింగ్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోక పోవడమేంటని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇప్పటికైనా అధికారులు మట్టి మాఫియాను అదుపు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బర్కం నవీన్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, తుమ్మ విజయ్‌కుమార్ ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కొలనూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. టాయిలెట్ల వద్ద కాలువ ఉండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. గతేడాది కురిసిన వర్షాలకు ప్రహరీ కూలిపోయింది. టాయిలెట్‌కు వెళ్లిన విద్యార్థులు ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.



'నెలరోజుల్లో 21 సెల్‌ఫోన్లు అప్పగించాం'



భాస్కర్‌రావుకు ఫోన్ అప్పగిస్తున్న సీఐ వెంకటేశ్

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో పాటు స్థానికులు తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకుంటే సీఈఐఆర్ ద్వారా గుర్తించి పోలీసు శాఖ వారికి అప్పగిస్తుందని సీఐ వెంకటేశ్ తెలిపారు. హైదరాబాద్‌లోని చింతల్‌బస్తీకి చెందిన భాస్కర్‌రావు ఆదివారం తన మొబైల్‌ను పోగొట్టుకున్నట్లు తమకు దరఖాస్తు అందడంతో సీఈఐఆర్ ద్వారా గుర్తించి సెల్‌ఫోన్‌ను అప్పగించినట్లు చెప్పారు. వేములవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో నెలరోజుల్లో 21 సెల్‌ఫోన్లు అప్పగించినట్లు తెలి పారు. ఎవరైనా ఫోన్లు పోగొట్టుకుంటే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. కార్యక్రమంలో ఎస్సై వెంకట్రాజం ఉన్నారు.

కుప్ప చేస్తూ.. నిప్పు పెడుతూ..

- వేములవాడలో చెత్తను కాల్చుతున్న పారిశుధ్య సిబ్బంది
- పొగతో ఇబ్బందిపడుతున్న పట్టణవాసులు
- ఫిర్యాదు చేసినా మారని తీరు

వేములవాడ: 'చెత్తబండి వచ్చిందమ్మా.. తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వండమ్మా.. ప్లాస్టిక్ వాడకండి.. మోరీల్లో పడేయకండి' అంటూ పొద్దున్నే మైకుల ద్వారా ప్రచారం చేస్తున్న వేములవాడ మున్సిపల్ శానిటేషన్ విభాగం తమ సిబ్బంది పనితీరును మాత్రం గమనించడం లేదు. నిత్యం రోడ్లు శుభ్రం చేసి చెత్తను డంప్‌యార్డుకు పంపించాల్సి ఉండగా, కుప్పలుగా చేసి కాల్చుతున్నారని, పొగతో ఇబ్బంది పడుతున్నామని పట్టణవాసులు వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా సిబ్బందిలో మార్పు రావడంలేదంటూ పేర్కొంటున్నారు. ఇక ఖాళీ ప్రదేశాల్లోని చెత్తను ఎత్తకుండానే కాల్చేస్తున్నారు.



'ఈఫొటో వేములవాడ పట్టణంలోని మొదటి బైపాస్‌రోడ్డు. ఇక్కడ మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు చెత్తను కుప్ప చేసి నిప్పు పెట్టింది. పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించి ట్రాక్టర్ లేదా వ్యాన్లలో డంప్‌యార్డుకు తరలించాలి. కానీ ఇక్కడ చెత్తను తగులబెడుతూ కాలుష్యానికి కారణమవుతున్నారు. ఇలా ఇదొక్క చోటనే కాదు పట్టణంలోని 28 వార్డుల్లో మున్సిపల్ కార్మికులు ఇలాగే చేస్తున్నారంటూ స్థానికులు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు.



'ఈ చిత్రం పట్టణంలోని త్రినేత్ర ఫంక్షన్ హాలు ప్రాంతంలోనిది. వేకువజామున విధులకు వచ్చిన మున్సిపల్ కార్మికురాలు చెత్తను పోగుచేసి నిప్పుపెట్టింది. ఇదేమిటని ప్రశ్నిస్తున్న కాలనీవాసులపై ఎదురు మాట్లాడుతోందని స్థానికులు వాపోతున్నారు'.



'ఇది సాక్షాత్తు కౌన్సిలర్ యాచమనేని శ్రీనివాస్‌రావు ఇంటి ముందున్న ప్రధాన రోడ్డు. రోడ్డు పక్కనే చెత్తకుప్పలకు నిప్పుపెట్టి కాలుస్తున్నారు. దీంతో పక్కనే ఉన్న మండల పరిషత్ ఆవరణలోని మాకింగ్‌ట్రాక్‌లో వాకింగ్ చేసేవారు అవస్థలు పడుతున్నారు'.



'ఈచిత్రంలో ఉన్నది సెస్ ఆఫీస్ కార్యాలయం రోడ్డు. ఇక్కడ సైతం రోజూ చెత్తకుప్పలను తగులబెడుతున్నారని, పొగతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పొగతో ఇబ్బంది..



పట్టణంలోని మండల పరిషత్ ప్రాంతంలో వాకింగ్ చేయాలంటే పొగతో ఇబ్బంది ఉంది. మున్సిపల్ సిబ్బంది రోడ్లపైనే చెత్తను తగులబెడుతుండటంతో వాయుకాలుష్యం పెరిగిపోతుంది. శానిటేషన్ విభాగం అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి. అలాగే మండల పరిషత్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు ఆశ్రయం పొందుతూ బహిర్భూమికి వెళ్తున్నారు. వీటిని అరికట్టాల్సిన అవసరం ఉంది. – రేగుల రాము, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



మార్నింగ్ వాకింగ్‌కు వెళ్తే పొగతో ఇబ్బందిపడుతున్నం. అధికారులు, సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదు. నిత్యం రోడ్లపై చెత్తను తగులబెడుతూనే ఉన్నారు. కమిషనర్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. – గోస్కుల రవి, వాకర్స్‌క్లబ్ ప్రతినిధి

జరిమానా విధిస్తున్నాం



రోడ్లను ఊడ్చే క్రమంలో సేకరించే చెత్తను డంప్‌యార్డుకు తరలించాలి. రోడ్లపైనే చెత్త తగులబెట్టడం చట్టరీత్యా నేరం. ఇటీవల తమకు అందిన ఫిర్యాదులపై విచారణ జరిపి శానిటేషన్ సిబ్బందికి జరిమానా విధించాం. నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన జవాన్‌ను సస్పెండ్ చేశాం. – అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

బీసీ గురుకులాల్లో తాత్కాలిక ఉద్యోగాలు

సిరిసిల్లఅర్బన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలో పలు సబ్జెక్టులలో బోధించుటకు తాత్కాలిక పద్ధతిలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ గురుకులాల ఆర్సీవో గౌతమ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 26 నుంచి 28 లోపు తిమ్మాపూర్ మండల పరిధిలోని గురుకుల పాఠశాలలో విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మిగతా వివరాలకు 72017 70261 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆర్సీవో సూచించారు.

ఖాకీల బదిలీలకు వేళాయే..

- ఎన్నికల నిర్వహణకు కమిషన్ నిర్ణయించిన నేపథ్యంలో..
- జిల్లాలోని పోలీసుశాఖలో చర్చ
- పోస్టింగ్ కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలు

సిరిసిల్లక్రైం: ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే కమిషన్ నిర్ణయించిన విషయం విదితమే. నవంబర్‌లో ఎన్నికలుంటాయన్న ఊహాగానాల నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులకు ఎన్నికల బదిలీ వేటు తప్పేలా లేదు. ఇప్పటికే ఎన్నికల వాతావరణం ప్రచార సరళిలోనే సమావేశాలు జరుగతున్న వేళ ఇక తమకు బదిలీలు అనివార్యమని భావించిన కొందరు పోలీసు అధికారులు మళ్లీ మంచి పోస్టింగ్ సాధించడం కోసం నేతలు, వారి గాడ్‌ఫాదర్‌గా భావించే పోలీసు ఉన్నతాధికారులకు తమ గోడు విన్నవించే పనిలో నిమగ్నమవుతున్నారు.

నాలుగేళ్లలో మూడేళ్లు పని చేస్తే..



ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం నాలుగేళ్ల కాలంలో మూడేళ్లు జిల్లాలోని ఒకే ప్రాంతంలో సివిల్ విభాగంలో పని చేసిన పోలీసు అధికారులకు బదిలీ వేటు తప్పదని సీనియర్ పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇక్కడే ఉండి విధులు నిర్వహించాలంటే సదరు అధికారులు లా అండ్ ఆర్డర్ కాకుండా లూప్‌లైన్‌లోని విధులు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని విశ్వసనీయ సమాచారం. అయితే ఈ విధానం ఒక నియోజకవర్గంలో ఒకే స్టేషన్‌లో పని చేసినవారికి వర్తిస్తుందని మరికొందరు అధికారులు పేర్కొంటుండగా.. ఎవరి ధీమాలో వారు ఉన్నారు.

మళ్లీ పోస్టింగ్స్ ప్రణాళికలు

జిల్లా నుంచి బదిలీ తప్పదన్న అధికారులు మరో జిల్లాలో మంచి పోస్టింగ్ దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. కొందరు సెలవులు పెట్టి వారికి సహకరించే నేతల నుంచి ఆఫర్ లెటర్స్ అందుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఖద్దర్ చొక్కాల పవర్ పనిచేయదని అనుమానాలున్న అధికారులు పోలీసుశాఖలో తమకు గాడ్‌ఫాదర్‌గా ఉండే ఉన్నతాధికారులకు చెప్పి పోస్టింగ్ వచ్చేలా ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా రోజులు గడుపుతున్నారు. కాగా జిల్లాలో స్థానికతతో విధులు నిర్వహిస్తున్న నలుగురు, సుదీర్ఘకాలం పని చేసిన మరో నలుగురు పోలీస్ అధికారులు బదిలీపై వెళ్లనున్నారు. ఇందులో ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులున్నారు. ఒక్కరిద్దరిని ఇటీవలే బదిలీ చేయగా సంబంధిత విషయాలు ఆలస్యంగా బయటకు వచ్చాయి. అయితే ఈ బదిలీలు కోడ్ నిబంధనలతో జరగలేదని విధుల నిర్వహణలో పోలీసు ఉన్నతాధికారి తీసుకున్న చర్యలో భాగంగా బదిలీ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం.

ఇక్కడే పని చేసేందుకు..

ఎన్నికల వేళ బదిలీ వేటు పడుతుందని అనుమానాలున్న వారు లూప్‌లైన్‌లో పని చేయడానికి సిద్ధమన్న సంకేతాలు పోలీసు ఉన్నతాధికారి ఇప్పటికే చేరవేసినట్లు అధికారుల్లో చర్చ జరుగుతోంది. సిరిసిల్ల పరిధిలోని సీఐ స్థాయి అధికారుల్లో ఒకరిద్దరికి స్టేషన్ మార్పిడి జరుగుతుందన్న ప్రచారం సాగుతుండగా మరొకరు ఎస్పీలో తనకు అవకాశం కల్పిస్తారన్న ధీమాను తోటి అధికారులతో పలుమార్లు చెప్పినట్లు, దాని కోసం రాష్ట్ర మంత్రికి విన్నవించినట్లు తెలిసింది. జిల్లాలో ఉన్న ఇద్దరు డీఎస్పీల్లో మార్పులు చేర్పులు జరిగితే ఇప్పటికే విధుల్లో ఉన్న ఓ అధికారి అవకాశం కోసం చూస్తుండగా ఇటీవలే డీఎస్పీగా పదోన్నతి పొందిన అధికారి ఒకరు తనకు జిల్లాలో ఉన్న పాత సంబంధాలతో, అధికారి పార్టీ నేతల అండతో జిల్లాకు రావడానికి ప్రయత్నాలు మొదలెట్టినట్లు సమాచారం. కాగా, పోలీసు ఉన్నతాధికారులు మార్పుల నేపథ్యంలో సదరు అధికారికి జిల్లాలో మళ్లీ పోస్టింగ్ రావడం కష్టమేనని శాఖలోని పలువురు అధికారులే చర్చలు జరుపుతున్నారు. ఏళ్ల కాలంగా వివిధ విభాగాల్లో పని చేసిన అధికారులకు అవకాశాలు కల్పించే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది.

నిబంధనల మేరకు..



ఎన్నికల నిబంధనల ప్రకారం కొందరు అధికారులకు బదిలీ అనేది తప్పదు. విధుల నిర్వహణలో సరిగా ఉండే అధికారులకు అవకాశాలు తప్పక వస్తాయి. ఎంత మంది జిల్లా నుంచి వెళ్తారన్న దానిపై ఇప్పటికైతే స్పష్టత లేదు. నివేదికలు చేసి నిబంధనల మేరకు బదిలీలు ఎన్నికల కోడ్ నేపథ్యంలో జరుగుతాయి. – అఖిల్ మహాజన్, ఎస్పీ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి-రాళ్లపేట గ్రామ శివారు మూలమలుపు వద్ద ఆదివారం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓబులాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ తన ద్విచక్ర వాహనంపై మండెపల్లి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో చంద్రంపేటకు చెందిన రాజు, స్వరూప ప్యాసింజర్ ఆటోలో ఓబులాపూర్‌కు వెళ్తుండగా మూలమలుపు వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ రాజు (45), ప్రయాణికురాలు స్వరూప (25)కు తీవ్ర గాయాలుకాగా శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి గాయాలు


అంజయ్య గౌడ్

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన కందుకూరు అంజయ్య గౌడ్ తాటిచెట్టు పై నుంచి పడగా తీవ్ర గాయాలయ్యాయి. అంజయ్య రోజూ మాదిరిగానే ఆదివారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. మోకుజారి చెట్టు పైనుంచి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం అంజయ్యను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దేశ చరిత్రలో చీకటి రోజు ఎమర్జెన్సీ


మాట్లాడుతున్న గోపి


సిరిసిల్లటౌన్: దేశ చరిత్రలో 1975వ సంవత్సరంలో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించడం చీకటి రోజు అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ పాలన, అధికారాన్ని అడ్డుపెట్టుకోవడానికి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఆడెపు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

దాతలసాయంతో అంత్యక్రియలు పూర్తి

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని బస్వాపూర్‌కు చెందిన గొడిసెల దేవయ్య (45) శనివారం సాయంత్రం గ్రామశివారులోని కల్వర్టు వద్ద కారు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు పట్టుబట్టడంతో పోస్టుమార్టం కూడా ఆలస్యంగా నిర్వహించారు. మద్యం మత్తులో కారు నడిపిన వ్యక్తికి చెందినవారు మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు చందాలు పోగుచేశారు. జెడ్పీటీసీ పూర్మాణి మంజుల రాంలింగారెడ్డి దంపతులు రూ.5,016 తోపాటు దాతల సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై ఇప్పటికే తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

పంచాయితీలు.. సెటిల్‌మెంట్లు

- రాబంధుల్లా పీక్కుతింటున్న పెద్దమనుషులు
- చిన్న సమస్యే అయినా.. రోజులకొద్దీ పంచాయితీలు
- నిత్యం మందు..విందు
- పోలీసులు దృష్టి సారించాలంటున్న సామాన్యులు



రుద్రంగిలో ఒకే కాలనీలో నివసించే ఇద్దరు ఇటీవల గొడవపడ్డారు. ఒకరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా.. మరొకరు పెద్దమనిషిగా చలామణి అవుతున్న మండలంలోని ఓ జీపీ వార్డుసభ్యుడిని కలిశాడు. ఇదే అదునుగా భావించిన సదరు పెద్దమనిషి తన ప్రణాళికను అమలు చేశాడు. ఎస్సైకి డబ్బులు ఇవ్వాలని రూ.12వేలు వసూలు చేసినట్లు సమాచారం. విషయం బయటకు పొక్కడంతో ఎస్సై పిలిపించి డబ్బులు బాధితునికి తిరిగివ్వాలని.. మరోసారి ఇలా వసూలు చేస్తే కేసు నమోదు చేస్తానని హెచ్చరించినట్లు తెలిసింది. ఇదే వ్యక్తి మరో పంచాయితీలోనూ ఇలాగే డబ్బులు గుంజాలని చూస్తే దేహశుద్ధి చేసినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండలంలోని పలు పల్లెల్లో పెద్దమనుషులుగా చలామణి అయ్యే వ్యక్తులు అమాయకుల అవసరాన్ని ఆసరాగా మ ల్చుకుంటున్నారు. డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. చిన్నపాటి సమస్యలతో గొడవలు పడి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేవారిని సైతం తమ పన్నాగంలో పడేలా చేసి రోజులకొద్దీ పంచాయితీలు కొనసాగి స్తున్నారు. ఇలా పంచాయితీలు నడిచినన్నీ రోజు లు నిత్యం వీరికి మందు, విందు సర్వసాధారణం.

వాయిదాలు.. విందులు

పంచాయితీలు నిర్వహించే పెద్దమనుషులు ఏదో ఒక కారణంతో ఒక్కో పంచాయితీని నాలుగైదు సార్లు వాయిదాలు వేస్తున్నారు. ఇలా వాయిదాపడ్డ ప్రతీసారి పంచాయితీ పెద్దలకు మందు, మాంసంలతో విందు ఏర్పాటు చేయడం బాధితుల వంతుగా మారింది. కొన్ని గ్రామాల్లోనైతే చిన్నపాటి గొడవ జరిగితే చాలు.. ఎవరు పిలవకుండానే అక్కడ వాలిపోతూ పెద్దరికం ప్రదర్శించి పంచాయితీలు చెబుతుంటున్నారు. ఇలా మద్యలో దూరి అందినకాడికి దండుకుంటున్న పెద్దమనుషులు మండలంలోని ప్రతీ గ్రామంలో కనిపిస్తున్నారు. వీరి ఆగడాలు ఇటీవల మితిమీరుతుండడంతోసామన్యులు గగ్గోలు పడుతున్నారు.

రుద్రంగికి చెందిన ఒకరు తన భూమిని అమ్ముకోగా.. ఆ వ్యవహారంలోకి ముగ్గురు పెద్దమనుషులు ప్రవేశించారు. ఆ భూమిని ఓ మహిళకు ఇప్పిస్తామని చెప్పి.. ఆమె నుంచి ఖర్చుల కోసమని రూ.30 వేలు వసూలు చేసుకున్నారు. సదరు పెద్దమనుషులు భూమి అమ్మిన వ్యక్తి అన్నతో కలిసి కొత్త పన్నాగం పన్నారు. అన్నకే అమ్మాలి కానీ.. ఇతరులకు ఎలా అమ్ముతారంటూ బెదిరించే ప్రయత్నం చేశారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అమ్మిన వ్యక్తి బెదరకపోవడంతో మహిళ రూ.30వేలు నష్టపోగా.. సదరు ముగ్గురు పెద్ద మనుషులు, మహిళకు మధ్య మరో పంచాయితీ పడిందని తెలిసింది.

పోలీస్‌స్టేషన్‌కు రావాలి

ప్రజలు తమకు ఏ సమస్యలు ఎదురైనా పోలీస్‌స్టేషన్‌కు రావాలి. గ్రామాల్లో పెద్ద మనుషులను ఆశ్రయించి, వారికి మద్యం, మాంసం తెప్పిస్తూ, డబ్బులు ఇస్తూ నష్టపోవద్దు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తున్నాం. ఎలాంటి భయం లేకుండా ఠాణాకు వచ్చి ఫిర్యాదు చేస్తే సమస్యలు పరిష్కరిస్తాం. పెద్దమనుషుల వద్దకు వెళ్లి నష్టపోవద్దు.

– ప్రభాకర్, ఎస్సై, రుద్రంగి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నిజామాబాద్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో చదివిన 2008–09 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగ క్షేమాలను తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన రోజులను నెమరవేసుకొని ఆనందంగా గడిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సహ విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు.

అసత్య ప్రచారం చేసిన వారిపై చర్య తీసుకోవాలి

సిరిసిల్లక్రైం: పోలీసులపై అసత్య ప్రచారం చేసిన వారి వివరాలపై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల పట్టణానికి చెందిన ఎడ్ల అరవింద్ కోరాడు. ఆదివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ, తన మొబైల్ నంబర్‌ను ఉపయోగించి సామాజిక మాధ్యమాల్లో ఓ సీఐ స్థాయి అధికారి తనను తిట్టినట్లు ప్రచారం జరుగుతుందని, కానీ దానిలో వాస్తవం లేదని వాపోయాడు. ఇందులో తనకు సంబంధం లేదని స్పష్టం చేశాడు.

అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు

తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌లో కారు ప్రమాదంలో వ్యక్తి మరణించగా సంబంధిత విషయమై కేసు నమోదు చేసినప్పటికీ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, పోలీసులపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు. బాధితుల పట్ల పోలీసులు నిర్లక్ష్యంగా వ్యహరించారని సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేసిన చిగురు ప్రశాంత్‌పై ఆదివారం కేసు నమోదు అయింది. నిజాలు తెలియకుండా పోలీసుల విధి నిర్వహణపై అనుమానాలకు తావిచ్చేలా, ప్రజలకు నమ్మకం సడలేలా చేసేవారిపై కఠిన చర్యలకు వెళ్తామని సీఐ హెచ్చరించారు.

ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు


శాత్రాజుపల్లిలో చెరువు నుంచి మట్టి తీస్తున్న జేసీబీ

వేములవాడరూరల్: వేములవాడ మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాలతో పాటు, రూరల్ మండలంలోని పలుప్రాంతాల నుంచి కొందరు వ్యాపారులు మట్టిని తరలిస్తున్నట్లు తెలుపుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ స్థలంలో మట్టిని తరలించవద్దని నిబంధన ఉన్నా కొందరు ప్రజాప్రతినిధులు ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా శాత్రాజుపల్లి, నాగాయపల్లి, మర్రిపల్లి, ఫాజుల్‌నగర్, పలు గ్రామాల్లోని చెరువుల నుంచి మట్టిని తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ శాఖ అధికారులు, సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చెరువులోని చెట్లు అమ్ముకున్నరు

- చేతులు మారిన రూ.10 లక్షలు.?
- ప్రజాప్రతినిధి భర్తే పాత్రదారి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని అంకుషాపూర్‌లో ఓ ప్రజాప్రతినిధి భర్త అక్రమార్జనకు పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని చెరువు సమీపంలో వందలసంఖ్యలో ఉన్న చెట్లను అప్పనంగా అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో కొంతమందితో చేతులు కలిపిన సదరు ప్రజాప్రతినిధి భర్త చెట్లను విక్రయించి ఏకంగా రూ.10 లక్షలు వెనకేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం బయటకి పొక్కినా అధికారులు మాత్రం చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకుడు కావడం వల్లే గ్రామంలో పెత్తనం చెలాయిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల వద్ద ఒకొక్కరి నుంచి రూ.15 వేలు వరకు వసూలు చేశాడని గ్రామంలో చర్చ జరుగుతోంది. జిల్లా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని తెలుపుతున్నారు.

ప్రైవేట్ స్కూల్ పుస్తకాల గది సీజ్


నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న పుస్తకాలు, సీజ్ అయిన బుక్‌స్టాల్ గది

గోదావరిఖనిటౌన్: స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతుండడంతో విద్యాశాఖ అధికారులు పుస్తకాల గదిని సీజ్ చేసినట్లు ఏబీవీపీ నగరకార్యదర్శి సిద్ధార్థ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫార్మ్, స్టేషనరీలు అధిక ధరలకు అమ్ముతున్నారని సమాచారం అందించడంతో బుక్ స్టాల్‌ని విద్యాశాఖ అధికారులు సీజ్‌చేశారన్నారు. ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, స్టేషనరీల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటు విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక దోపిడీకి గురిచేస్తున్నాయన్నారు. అనుమతులు లేకుండా పాఠశాలలు, పుస్తకాలు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

డ్రైవర్ నిర్లక్ష్యం.. ప్రయాణికులకు గాయాలు


కాంపౌండ్‌ను ఢీకొట్టిన వాహనం,


ఘటన స్థలంలో క్షతగాత్రురాలు

తిమ్మాపూర్: దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకున్న ఘటన ఆదివారం సాయంత్రం వెలుగుచూసింది. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన 15 మంది బృందం సభ్యులు శనివారం కాళేశ్వరం దైవదర్శనానికి వెళ్లి ఆదివారం తిరిగి వస్తుండగా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి శివారులో వీరు ప్రయాణిస్తున్న తుఫాన్ వాహనం ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈక్రమంలో అదుపుతప్పి పక్కనున్న పాలడెయిరీ కాంపౌండ్ వాల్‌కు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న సోమయ్య, లక్ష్మీ, భాగ్యమ్మ సత్యనారాయణతో పాటు మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ రవికి తీవ్ర గాయాలు కాగా మరికొందరు పిల్లలు స్వల్పంగ గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎల్ఎండీ ఎస్సై సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ట్రాక్టర్‌ను పక్కకు జరిపి ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తతో వాహనం నడపగా ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు.


గాయపడిన మహిళలు

అనారోగ్యంతో వ్యక్తి మృతి

వీర్నపల్లి: మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన కుమ్మరి మహేశ్ (35) కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్ గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, చెప్పుల దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య రమ్య , కుమారులు అరవింద్ , రాకేష్, కూతుళ్లు శ్రావణి , హిమబిందు , జున్ను , ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ నందగిరి లింగం అన్నారు.

తల్లీ కుమారుడి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): తల్లీ కుమారుడు అదృశ్యమైన ఘటన మండలంలోని బుగ్గ రాజేశ్వరతండాలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గుగులోతు మేరీ (28) చిన్న కుమారుడు శివాన్ష్‌తో కలిసి తల్లిగారి ఇల్లు అయిన రాచర్ల గుండారం గ్రామానికి వెళ్తున్నానని చెప్పగా భర్త అనిల్ ఎల్లారెడ్డిపేట బస్టాండ్‌లో శనివారం కామారెడ్డి డిపో బస్సు ఎక్కించాడు. ఆది వారం ఫోన్‌చేయగా స్విచ్చాఫ్ రావడంతో అనుమానం వచ్చి గుండారంలోని అత్తగారింటికి ఫోన్ చేశాడు. అక్కడికీ రాలేదని వారు తెలపడం, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మంథని: ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన సమ్మయ్య అనే వ్యక్తి బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం సమ్మయ్య తాపీ మేస్త్రీ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఓడేడు–గోదావరిఖని రహదారిపై వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడడంతో స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిపై కేసు నమోదు

జమ్మికుంట: అకారణంగా దూషించిన వ్యక్తిపై ఎస్సై యూనిస్ అహ్మద్ అలి కేసు నమోదుచేసినట్లు ఆదివారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని బిజిగిరిషరీఫ్ సర్పంచ్ రాసపల్లి సదయ్యను అదే గ్రామానికి చెందిన రాసపల్లి రమేశ్ అనేవ్యక్తి వారి తల్లి తండ్రులకు దళితబంధులో కారు ఇప్పించడంతో తన సోదరుడు కారు నడుపుకుంటున్నాడని దీంతో నాకు నష్టం వాటిల్లిందని సదయ్య ఇంట్లోకి చొరబడి అకారణంగా దూషించాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపార

బీపీఈడీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ

ఎల్లారెడ్డిపేట: రెండ్రోజుల వెలువడిన బీపీఈడీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన పెద్దూరి రమ్య ప్రతిభ కనబర్చింది. రాష్ట్రస్థాయిలో 36వ ర్యాంకు సాధించడంపై పలువురు రమ్యను అభినందించారు.

సెల్‌టవర్ బ్యాటరీలు చోరీ

ఇబ్రహీంపట్నం : మండలంలోని గోధూర్ గ్రామంలో ఎయిర్‌టెల్ సెల్‌టవర్ వద్ద శనివారం రాత్రి బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై ఉమాసాగర్ ఆదివారం తెలిపారు. టవర్ వద్ద 24 బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కంపెనీ సూపర్‌వైజర్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాతీయస్థాయి ఉషు పోటీలకు జిల్లా క్రీడాకారులు


ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: మహారాష్ట్ర పూణెలోని శివ్ ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 26 నుంచి జూలై 1 వరకు నిర్వహించే జాతీయస్థాయి సీనీయర్స్ వుషు పోటీలకు జిల్లాకు చెందిన కె.సాయికృష్ణ, శ్రీనివాస్, శ్రీధర్, శ్రీనివాస్ ఎంపికైనట్లు ఉషు సంఘం కార్యదర్శి విద్యాసాగర్ తెలిపారు. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధానకార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కోచ్‌లు కోడూరి శేఖర్, ఎలంగదుల శ్రీనివాస్, రాణావిక్రం, గాంధీ అభినందించారు.

మహిళ మెడలోంచి పుస్తెలు చోరీ


బాధితురాలు లక్ష్మీ

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుమణి లక్ష్మి అనే మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడు. ఇబ్రహీంపట్నం మండలం బర్దీపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి ఆనారోగ్యంతో బాధపడుతూ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చి మెడలోని నల్లపూసల గొలుసుకున్న పుస్తెలను ఎత్తుకెళ్లాడు. బాధితురాలు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి


రాజమౌళి(ఫైల్)

ఎలిగేడు: మండలంలోని లోకపేట గ్రామానికి చెందిన వెలిచాల రాజమౌళి(55) గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి కిందపడి మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, తోటి గీత కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు గీత కార్మికుడు రాజమౌళి రోజువారిగా కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా మోకు జారడంతో చెట్టుపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నా రు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జూలపల్లి పోలీసులు తెలిపారు. బాధితకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ ప్రభావతి, గీత కార్మికులు, గ్రామస్తులు కోరారు.

అనారోగ్యంతో మరొకరు..

కరీంనగర్‌రూరల్: అనారోగ్యంతో మృతిచెందిన ఓ వ్యక్తి అంత్యక్రియలు నిర్వహించలేని దీనస్థితిలో కుటుంబసభ్యులుండగా యువకులు స్పందించి విరాళాలు సేకరించారు. నగదును కుటుంబ సభ్యులకు అందించి మానవత్వం చాటుకున్నారు. మిగిలిన గ్రామాల ఆదర్శంగా నిలిచారు. కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు చెందిన స్వర్ణకారుడు కట్ట రమేశ్(58) వృత్తి పనులు సక్రమంగా సాగక మెట్‌పల్లిలోని కోళ్లఫారంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆరునెలలుగా అనారోగ్యంతో ఇంటివద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం ఆకస్మికంగా మృతిచెందాడు. భార్య నిర్మల గృహిణికాగా కుమారుడు సూరజ్, కుమార్తె సుచితలున్నారు. అంత్యక్రియలు నిర్వహించలేని కడు పేదరికంలో కుటుంబం ఉండగా గ్రామంలోని యువత స్పందించి వాట్సప్ గ్రూప్‌లో పోస్టుచేయడంతో స్పందించిన యువత విరాళాలు ప్రకటించారు. ఉపసర్పంచ్ సంపత్ రావు ఆధ్వర్యంలో యువకులు రూ. 10వేల ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబానికి అందించగా అంత్యక్రియలు నిర్వహించారు. నిరుపేద అంత్యక్రియలకు విరాళాలను అందించి మానవత్వం ప్రదర్శించిన యువకులను స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.


కట్ట రమేశ్(ఫైల్)

ప్రమాదవశాత్తు జారిపడి యువకుడు..

చందుర్తి(వేములవాడ) : ప్రమాదవశాత్తు జారిపడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ఆశిరెడ్డిపల్లెలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దోకూరి పున్నమ రెడ్డి అనే రైతు వద్ద బిహార్‌కు చెందిన సుజిత్‌కుమార్ (19) కూలీగా చేరాడు. పశువుల పాక (డైయిరీ ఫామ్)లో ఆదివారం ఉదయం ఆవు పాలు పితికి బయటకు వచ్చే క్రమంలో సుజిత్ కుమార్ పేడపై కాలుజారి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న సిమెంటు స్తంభంపై పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలుకాగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడే పనిచేస్తున్న కూలీలు వచ్చి చూడగా సుజిత్‌కుమార్ మృతిచెందాడు. యువకుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం వారి బంధవులకు మృతదేహాన్ని అప్పగించినున్నట్లు ఎస్సై జిల్లెల్ల రమేశ్ పేర్కొన్నారు.

దుకాణంలో చోరీ


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న ఓ దుకాణంలో శనివారం అర్ధరాత్రి నగదుతోపాటు సీసీ కెమెరాల సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో ఐటీసీ బ్రాండ్ హోల్‌సెల్ దుకాణాన్ని ఊటూరు మహేశ్ నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి కౌంటర్లలో సుమారు రూ.80 వేలు నగదు, రూ.50వేలు విలువైన బంగారు కాయిన్స్, రూ.4వేల విలువైన వెండి కాయిన్స్ ఉంచి, తాళాలు వేసి వెళ్లారు. తెల్లారేసరికి షెట్టర్ పగులగొట్టి ఉండటంతో పాటు నగదు కనిపించకపోవడంతో పోలీసులు సమాచారం అందించారు. పట్టణ సీఐ నటేశ్, ఎస్సై రమేశ్, అబ్దుల్ రహీం ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. సీసీ కెమెరాలు పరిశీలించగా మారుతి వ్యాన్‌లో ముగ్గురు వ్యక్తులు వచ్చి దొంగతనం చేసినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు.